

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 154 పేజీలు - 04 వెల - 05/-

బుధవారం 03-06-2026

రోడ్డు వేశారు మట్టి కుప్పలు వదిలేశారు



3లో

## నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన



2లో

- భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో మూడో దేశం జోక్యం కుదరదని స్పష్టం చేసిన భారత్
- ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత విదేశాంగ శాఖ వెల్లడి
- భారత్, నేపాల్ పరస్పరం భూభాగాలు ఆక్రమించుకున్నాయన్న నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు
- ద్వైపాక్షిక చర్చలకే కట్టుబడి ఉన్నామని భారత్ స్పష్టీకరణ

భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం



# 2027 గోదావరి పుష్కరాలు చరిత్రలో నిలిచిపోవాలి: సీఎం

**2027 గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశం**

- పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి
- ధవళేశ్వరం నుంచి పోలవరం వరకు అఖండ గోదావరి కారిడార్ అభివృద్ధికి సూచన
- ఆరు జిల్లాల్లో 525 ఘాట్లు, 10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- జూన్ 24 కల్లా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశం

**పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం**

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మంత్రుల కమిటీ, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామని, ఇది యాత్రికులకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు ఉన్న ప్రాంతాన్ని 'అఖండ గోదావరి కారిడార్'గా అభివృద్ధి చేయాలని సూచించారు. పుష్కరాల కోసం అభివృద్ధి చేసే అన్ని మౌలిక సదుపాయాలు గోదావరి బేసిన్ ప్రాంతానికి శాశ్వత ఆస్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఈ పుష్కరాలతో రాజమహేంద్రవరం ఒక ప్రధాన మహానగరంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## నేటి నుంచి అమల్లోకి తెలంగాణ న్యాయవాదుల రక్షణ చట్టం

- తెలంగాణలో అమల్లోకి వచ్చిన అడ్వకేట్ల పరిరక్షణ చట్టం-2026
- మంగళవారం నుంచి అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- వృత్తిపరమైన విధుల్లో న్యాయవాదులకు రక్షణ కల్పించడమే లక్ష్యం
- న్యాయవాది మొయిజుద్దీన్ హత్య జరిగిన కొద్ది రోజులకే చట్టం అమలు



2

తెలంగాణలో న్యాయవాదుల భద్రతకు భరోసా కల్పిస్తూ రూపొందించిన 'అడ్వకేట్ల పరిరక్షణ చట్టం-2026' మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## మమత పార్టీకి భారీ షాక్.. చీలిక దిశగా తృణమూల్ కాంగ్రెస్?



2

- పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీకి చీలిక ముప్పు
- మహారాష్ట్ర శివసేన తరహా పరిణామాలు భాయమంటున్న నేతలు
- మమత సమావేశానికి డుమ్మా కొట్టిన ఎమ్మెల్యేలు, ఇద్దరిపై వేటు
- పార్టీ గుర్తు కోసం 50 మంది ఎమ్మెల్యేల మద్దతు కూడగడుతున్న అసమ్మతి వర్గం!

పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో తీవ్ర కలకలం చెలరేగుతోంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో చీలిక

## సీఎం విజయ్‌తో చిదంబరం అత్యవసర భేటీ.. ఎందుకోసం?

- రాజ్యసభ సీటు కాంగ్రెస్‌కు ఇవ్వాలని కోరినట్లు సమాచారం
- షణ్ముగం రాజీనామాతో రాజ్యసభ సీటుకు ఉపఎన్నిక
- అసెంబ్లీలో టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేల బలం
- కాంగ్రెస్ పార్టీకి ఐదుగురు ఎమ్మెల్యేలు
- టీవీకే ఏకపక్షంగా గెలిచే అవకాశం



2

# చెరువు కబ్జా ఆరోపణలపై పవన్ కల్యాణ్ ఫైర్..

**ఆరోపణలు నిరూపిస్తే ఆ చెరువును ప్రభుత్వానికే రాసిస్తానన్న పవన్**

- చెరువు కబ్జా ఆరోపణలపై తీవ్రంగా స్పందించిన పవన్ కళ్యాణ్
- తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి సవాల్
- నిజంగా కబ్జా చేసి ఉంటే తన ఇల్లు తగలబెట్టేవాళ్లని వ్యాఖ్య

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తనపై వస్తున్న చెరువు కబ్జా ఆరోపణలపై తీవ్రస్థాయిలో స్పందించారు. ఆ ఆరోపణలు నిరూపిస్తే సదరు ఆస్తిని తెలంగాణ ప్రభుత్వానికే రాసిస్తానని సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాదులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతాది 2లో



## అమరావతిపై జగన్ వైఖరి బాధ్యతారాహిత్యం



- వైసీపీ ప్రభుత్వం అమరావతిని అల్లకల్లోలం చేసిందన్న రాంప్రసాద్ రెడ్డి
- అమరావతి రైతుల కుటుంబాలను ఇబ్బందులకు గురి చేశారని మండిపాటు
- అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వ్యాఖ్య

2

రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత జగన్ అనుసరిస్తున్న వైఖరి

## పవన్ కల్యాణ్ పై మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- నటుడిగా పవన్ ను ఇష్టపడతామన్న మహేష్ గౌడ్
- రాజకీయపరంగా వ్యతిరేకిస్తామని వెల్లడి
- పవన్ ను తెర వెనుక నుండి ఎవరో వ్యక్తులు నడిపిస్తున్నారని వ్యాఖ్య

మిగతా 2లో




## ప్రపంచానికే గేట్‌వేగా తెలంగాణ

- రాష్ట్రాభివృద్ధే సంకల్పం
- తెలంగాణ రైజింగ్ సారధులు రైతులు, రైతు కూలీలే
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీనే లక్ష్యం
- గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఫ్యూచర్ సిటీ
- ఆర్థిక శక్తి కేంద్రాలుగా మహిళా సంఘాలు :?సీఎం ఏ రేవంత్‌రెడ్డి?ఘనంగా తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలు
- జాతీయ పతకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- 18 మంది పోలీసులకు ప్రతిభా పురస్కారాలు



హైదరాబాద్ తెలంగాణ రైజింగ్-2047కు సారధులు రైతులు, రైతు కూలీలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2047నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ సంకల్పం, తెలంగాణను ప్రపంచానికే గేట్‌వేగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళాకారుల ప్రదర్శనలను తిలకించారు. 18 మంది పోలీసులకు, వారి కుటుంబాలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ అమరులను స్మరించుకున్నారు. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్ష?లు తెలుపుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీకి ధన్యవాదాలు తెలిపారు. నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డపై పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. సాగునీటి రంగానికి ప్రాధాన్యత ప్రాణహిత -- చేవేళ్ల ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోసే ప్రయత్నం చేస్తున్నామనీ, తుమ్మిడిహట్టి బ్యారేజీ కోసం మహారాష్ట్ర సీఎంకు పలు లేఖలు రాశామని తెలిపారు.

మిగతాది 2లో

# నేటి నుంచి అమల్లోకి తెలంగాణ న్యాయవాదుల రక్షణ చట్టం

నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తూ అధికారికంగా నోటిఫై చేసింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ జీఓ నెం.41ను జారీ చేసింది. వృత్తిపరమైన విధుల్లో ఉన్న న్యాయవాదులపై దాడులు, వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో వారి రక్షణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో అసెంబ్లీలో 'తెలంగాణ అడ్వకేట్ల పరిరక్షణ బిల్లు-2026'ను ఆమోదించింది. గవర్నర్ ఆమోదం పొందిన ఈ చట్టం ఇప్పుడు అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం న్యాయవాదులకు పోలీస్ రక్షణ, తప్పుడు కేసుల నుంచి భద్రత, వేధింపులపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక యంత్రాంగం, బెదిరింపుల నుంచి రక్షణ వంటివి కల్పిస్తారు. ఇటీవల హైకోర్టు న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్ హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన కొద్దిరోజులకే ఈ చట్టం అమలులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మే 23న మసాబ్ ట్యాంక్‌లోని తన ఇంటి వద్ద మొయిజుద్దీన్‌ను ఒక కారుతో ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టడంతో ఆయన మరణించారు. ఈ కేసులో కాంగ్రెస్ నేత ముజాహిద్ ఆలం ఖాన్, అతని తండ్రి సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వక్ఫ్ ఆస్తుల వివాదమే ఈ హత్యకు కారణమని, రూ.15 లక్షల సుపారీ ఇచ్చి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ చట్టం న్యాయవాదుల ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారు నిర్భయంగా విధులు నిర్వర్తించడానికి దోహదపడుతుందని శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు గతంలో తెలిపారు. కర్ణాటక, రాజస్థాన్ తర్వాత దేశంలో ఇలాంటి చట్టాన్ని తీసుకొచ్చిన మూడో రాష్ట్రం తెలంగాణ కావడం విశేషం.

# నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన

భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా



ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం ప్రమేయానికి ఆస్కారమే లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన పరిష్కరించుకోవాలని పేర్కొంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల పార్లమెంటులో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ స్పందించింది. సరిహద్దు సమస్య పరిష్కారానికి భారత్, చైనాలతో మాట్లాడడమే కాకుండా, యూకే ప్రభుత్వంతో కూడా మాట్లాడామని చెప్పారు. యూకే ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిసారించాలని కోరుకుంటున్నామని, ఎందుకంటే, భారత్ ను బ్రిటీషర్లు పరిపాలించిన చరిత్రతో ఈ సమస్యకు సంబంధం ఉందని వివరించారు. అంతేకాకుండా, భారత్ తమ భూభాగంలోకి చొరబడినట్లే, నేపాల్ కూడా కొన్ని ప్రాంతాల్లో భారత భూభాగాలను ఆక్రమించుకుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు నేపాల్ పార్లమెంటులో తీవ్ర దుమారం రేపాయి. ప్రభుత్వ వైఖరిని బలహీనపరిచారంటూ ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. దీంతో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగి వివరణ ఇచ్చింది. ప్రధాని వ్యాఖ్యలు సరిహద్దులోని 'దస్‌గజ' (నో-మ్యాన్స్ ల్యాండ్) ప్రాంతంలో ఇరు దేశాల పౌరుల భూ వినియోగానికి సంబంధించినవని, అధికారిక ప్రాదేశిక వాదనలకు కాదని పేర్కొంది. లిపులేఖ్, కాలాపానీ, లింపియాధురా విషయంలో తమ అధికారిక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకుంటామని స్పష్టం చేసింది. 1816 నాటి సుగౌలీ ఒప్పందం ప్రకారం కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా తమవేనని నేపాల్ వాదిస్తుండగా, ఆ ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ పేర్కొంటోంది. తాజాగా నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన భారత్, ఏ దేశం మధ్యవర్తిత్వాన్నయినా తిరస్కరిస్తూ, ఇది కేవలం రెండు దేశాల మధ్య పరిష్కారం కావాల్సిన అంశమని తేల్చిచెప్పింది.

# అమరావతిపై జగన్ వైఖరి బాధ్యతారాహిత్యం: మంత్రి

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర



ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో పర్యటించిన ఆయన.. అమరావతి గురించి జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవని మండిపడ్డారు. ప్రపంచ స్థాయి రాజధానిని ఐదేళ్ల పాలనలో అల్లకల్లోలం చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని తెలిపారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టి, రాజధాని నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి.. ఇప్పుడు అభివృద్ధిపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ జగన్ తీరును ఎండగట్టారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతుల విశ్వాసాన్ని దెబ్బతీసి, వేలాది కుటుంబాలను గత వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా, ఇప్పుడు అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకున్న వారే అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ చేసిన విధ్వంసాన్ని సరిదిద్దుతూ, నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా, రాష్ట్ర గౌరవ ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వేగంగా అడుగులు వేస్తున్నాయని స్పష్టం చేశారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా రాజధాని నిర్మాణం కొనసాగుతుందని, దీనిపై జగన్ రాజకీయాలు చేయడం మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

# సీఎం విజయ్‌తో చిదంబరం అత్యవసర భేటీ.. ఎందుకోసం?

తమిళనాడు రాజకీయాల్లో రాజ్యసభ ఉపఎన్నిక వేడి మొదలైంది. సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రం నుంచి ఖాళీగా ఉన్న ఒక రాజ్యసభ స్థానానికి ఉపఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

### కాంగ్రెస్ అభ్యర్థన

కొత్తగా అధికారంలోకి వచ్చిన టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ బయట నుంచి మద్దతు ఇస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అసెంబ్లీలో ఆ పార్టీకి ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీ అభ్యర్థికి అధికార కూటమి మద్దతు ఇవ్వాలని చిదంబరం సీఎం విజయ్‌ను కోరారని తెలుస్తోంది. హైకమాండ్ సూచన మేరకే ఆయన ముఖ్యమంత్రిని కలిసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### ఎందుకు ఈ ఉపఎన్నిక?

గతంలో ఏఐఏడీఎంకే తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఉన్న షణ్ముగం ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. దాంతో ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ ఖాళీ ఏర్పడింది. ఈ స్థానాన్ని భర్తీ చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఉపఎన్నిక షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న బలాల ప్రకారం ఈ సీటును గెలుచుకునే పూర్తి అవకాశం అధికార టీవీకే కూటమికే ఉంది.


### సీఎం విజయ్ నిర్ణయం ఏంటి?

తమిళనాడు అసెంబ్లీలో టీవీకే పార్టీకి సొంతంగా 107 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మిత్రపక్షాల మద్దతు కూడా ఉండటంతో ఆ పార్టీ ఏకపక్షంగా గెలిచే పరిస్థితి ఉంది. అయితే ఈ సీటును కాంగ్రెస్‌కు కేటాయించాలా? లేదా తమ పార్టీ అభ్యర్థినే బరిలోకి దించాలా? అనే అంశంపై సీఎం విజయ్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై తమ పార్టీ సీనియర్ నాయకులు, కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తామని విజయ్ పేర్కొన్నట్లు తెలుస్తోంది.

# పవన్ కల్యాణ్ పై మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పవన్ కల్యాణ్‌పై తనకు ఉన్న వ్యక్తిగత అభిమానానికి, రాజకీయాలకు మధ్య స్పష్టమైన తేడా ఉందని ఆయన పేర్కొన్నారు. పవన్ కల్యాణ్‌ను ఒక నటుడిగా తామంతా ఇష్టపడతామని, అయితే రాజకీయ పరంగా మాత్రం ఆయనను తీవ్రంగా వ్యతిరేకిస్తామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. "పవన్ కల్యాణ్ ఆంధ్ర మూలాలు ఉన్న నాయకుడు. నటుడిగా ఆయనపై మాకు గౌరవం ఉంది, కానీ రాజకీయంగా మేము ఆయనతో విభేదిస్తాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ.. ఆయనను తెరవెనుక నుంచి ఎవరో వేరే వ్యక్తులు నడిపిస్తున్నారని ఆరోపించారు.

# 2027 గోదావరి పుష్కరాలు చరిత్రలో నిలిచిపోవాలి



పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మొత్తం 525 ఘాట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పుష్కరాలకు దాదాపు 9.95 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. యాత్రికుల సౌకర్యార్థం రహదారి, రైల్వే ట్రాఫిక్ నిర్వహణపై దృష్టి పెట్టాలని, పుష్కర ఘాట్లకు క్రమపద్ధతిలో నంబర్లు కేటాయించాలని ఆదేశించారు. ప్రత్యేక రైళ్లు, కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాయాలని అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన క్షేత్రస్థాయి పర్యటన సిఫార్సులను కూడా ప్రణాళికలో చేర్చాలని తెలిపారు. జూన్ 24 నాటికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఆ తర్వాత పుష్కరాలకు అధికారికంగా కౌంట్‌డౌన్ ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు.

# చెరువు కబ్జా ఆరోపణలపై పవన్ కల్యాణ్ ఫైర్.. రేవంత్ ప్రభుత్వానికి సవాల్



"మేము ఒక చెరువుని కబ్జా చేశామంట, నాకేం పనిలేదా? నిజంగా మీరు అన్నట్టుగా కబ్జా చేస్తే నా ఇల్లు తగలబెట్టేసేవారు" అంటూ పవన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని తాను నేరుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే చెబుతున్నానని పేర్కొన్నారు. ఆయనంటే తనకు ఇష్టం, గౌరవం ఉన్నాయని అన్నారు. "పవన్ కల్యాణ్ ఒక చెరువును ఆక్రమించుకున్నాడని మీరు నిరూపిస్తే, ఈరోజు నేను సంతోషంగా తెలంగాణ ప్రభుత్వానికి ఆ చెరువును రాసి ఇచ్చేస్తున్నాను" అని ఆయన అన్నారు. గతంలో కూడా తనను ఇబ్బంది పెట్టేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని పవన్ అన్నారు.

# మమత పార్టీకి భారీ షాక్.. చీలిక దిశగా తృణమూల్ కాంగ్రెస్?

పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో తీవ్ర కలకలం చెలరేగుతోంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో చీలిక ఖాయమనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలో శివసేన పార్టీకి ఎదురైన సంక్షోభంలాంటి పరిస్థితే ఇక్కడా పునరావృతం కానుందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎదురైన ఓటమి, పార్టీ అంతర్గత పరిణామాలు ఈ వాదనలకు బలం చేకూరుస్తున్నాయి. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ పిలిచిన కీలక సమావేశానికి 80 మంది ఎమ్మెల్యేలకు గాను కేవలం 20 మంది మాత్రమే హాజరవడంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. ఇది పార్టీలో అసమ్మతి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది. మరోవైపు, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో జూన్ 1న ఇద్దరు ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహాలను పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో అసంతృప్తి మరింత పెరిగింది. టీఎంసీ మాజీ నేత, ప్రస్తుత బీజేపీ మంత్రి తపస్ రాయ్ మాట్లాడుతూ, టీఎంసీ చీలిక దిశగా పయనిస్తోందని, అంతర్గత కుమ్ములాటలే దీనికి కారణమని వ్యాఖ్యానించారు. పార్టీ గుర్తు కోసం సుమారు 50 మంది ఎమ్మెల్యేలు ఏకతాటిపైకి వచ్చే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతోంది. పార్టీని కొందరు హైజాక్ చేశారని బహిష్కృత నేతలు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. కోల్‌కతాలో తన పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ మమతా బెనర్జీ భారీ ధర్నా నిర్వహించారు. "నేను పోరాడతాను లేదా చస్తాను" అని తేల్చి చెప్పారు. తమ పార్టీని బలహీనపరిచేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

# ప్రపంచానికే గేట్‌వేగా తెలంగాణ

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల పునరుద్ధరణ పనులు మొదలుపెట్టామని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల వాటా కోసం లౌక్యంతో కొట్లాడతామన్నారు.

### ఆర్థిక శక్తి కేంద్రాలుగా మహిళా సంఘాలు

రాష్ట్రంలో మహిళా సంఘాలు ఆర్థిక శక్తి కేంద్రాలుగా, ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్ష?త్రాలుగా మారాయని సీఎం అన్నారు. ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటుకు వాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆడబిడ్డలు దాదాపు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకోగలిగారనీ, ఆ డబ్బులు ఆ కుటుంబాల ఆర్థిక బలోపేతం కోసం దోహదపడ్డాయని తెలిపారు. 42.90 లక్షల కుటుంబాలకు రూ.500 రూపాయలకే సిలిండర్లు, 53.09 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 3 కోట్ల 38 వేల మందికి సన్న బియ్యం ఇస్తున్నామన్నారు.

### టార్గెట్ 4.50 లక్ష?ల ఇందిరమ్మ ఇండ్లు

రూ.22, 500 కోట్లు కేటాయించి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామనీ, కేవలం 13 నెలల కాలంలోనే లక్ష ఇండ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. సెప్టెంబర్ 17 నాటికి రెండు లక్ష?ల ఇండ్లు పూర్తిచేస్తామని హామీనిచ్చారు. ?

గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు

రాష్ట్రంలోని నాలుగు లక్ష?ల మంది గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ చట్టం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. 73 రంగాలకు చెందిన కార్మికులకు కనీస వేతనాలను నోటిఫై చేశామని తెలిపారు. తెలంగాణ కోసం పోరాడిన యోధులను గుర్తించి, వారికి, వారి కుటుంబాలకు తగిన న్యాయం చేయాలన్న లక్ష్యంతో కె.కేశవరావు, కోదండరాం నాయకత్వంలో అధికారికంగా ఒక కమిటీ వేశామనీ, నివేదిక రాగానే వారందరినీ సముచిత రీతిలో సత్కరించి వారికి న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వే కేంద్ర చేపడుతున్న జన గణనకు రోల్‌మోడల్‌గా నిలిచిందని తెలిపారు.

### ఉద్యోగులకు రూ. కోటి బీమా పథకం

తమ ప్రభుత్వం ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు వేస్తున్నదని సీఎం గర్వంగా చెప్పారు. ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల కోసం ప్రతినెలా వెయ్యి కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామన్నారు. ఉద్యోగులకు కోటి రూపాయలతో ప్రత్యేక బీమా పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య పథకం అమలు చేయబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి దాదాపు రూ.11 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. కన్న తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతలు స్వీకరించకుండా వృద్ధాశ్రమాలలో చేర్పించి చేతులు దులుపుకుంటున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల పోషణ జవాబుదారీతనం, పర్యవేక్షణకు చట్టం తెచ్చి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజా ప్రతినిధులను అందులో చేర్చామని తెలిపారు. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణం విషయంలో పట్టుదలగా ఉన్నామన్నారు. గద్దరన్న పేరుతో సినీ అవార్డులు ఇస్తున్నామని సీఎం చెప్పారు. తెలంగాణ మత సామరస్యానికి ప్రతీకఅనీ, అన్నీ మతాలు, కులాలు తెలంగాణ తల్లి ఒడిలో బిడ్డలేనని స్పష్టం చేశారు.

క్యూర్-ప్యూర్-రేర్ మోడల్

"తెలంగాణ రైజింగ్ -- 2047" విజన్ డాక్యుమెంట్లో క్యూర్-ప్యూర్-రేర్ గా రాష్ట్రాన్ని వర్గీకరించి అభివృద్ధిలో మూడంచెల వ్యూహాన్ని అనుసరిస్తున్నామని సీఎం తెలిపారు. హైదరాబాద్‌లో కబ్జాకు గురైన చెరువులు, కుంటలను కాపాడి వాటిని పునరుద్ధరించే బాధ్యతను హైడ్రాకు అప్పగించామని తెలిపారు. ఎల్ అండ్ టీ నుంచి మెట్రో రైల్‌ను కొనుగోలు చేసి ప్రజల ఆస్తిగా మార్చామని తెలిపారు. మెట్రో ఫేజ్2లో 122.9 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించే ప్రతిపాదనలతో తయారు చేసిన డీపీఆర్ ను కేంద్రానికి సమర్పించామని చెప్పారు. మూసీ పునరుజ్జీవనం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవనం ఫేజ్-1 ప్రాజెక్టు కింద పనులు చేస్తామని తెలిపారు. మూసీ ప్రాజెక్టులో భాగంగానే గోదావరి ఫేజ్ -2, ఫేజ్-3 పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. 2.5 టీఎంసీల గోదావరి జలాలను మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు తరలిస్తామని తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా మూసీ పరివాహకాన్ని తీర్చిదిద్దుతామన్నారు.


30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని గ్రీన్ ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఏర్పాటు చేస్తున్నామనీ, శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేయటం ద్వారా రీజనల్ కనెక్టివిటీ బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వరంగల్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. నాస్కామ్ జీసీసీ ల్యాండ్ స్కేప్ రిపోర్ట్ 2026 ప్రకారం దేశంలో కొత్తగా ఏర్పాటైన బీఎఫ్ఎస్ఐ జీసీసీల్లో 50 శాతం హైదరాబాద్‌ను ఎంచుకోవడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ టూరిజం పాలసీ ద్వారా మూడు లక్ష?ల ఉద్యోగాలు దక్కబోతున్నాయన్నారు. 2030 నాటికి తెలంగాణ టాప్ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలబెట్టాలనేది లక్ష్యమని తెలిపారు. దీంతో ఐదు లక్షల ఉద్యోగాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### సకల పంటల క్షేత్రంగా తీర్చిదిద్దండి

తెలంగాణలో ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 236.87 లక్షల మెట్రిక్ టన్నులుగా నమోదైందని సీఎం చెప్పారు. పంటల మార్పిడి ద్వారా తెలంగాణను సకల పంటల క్షేత్రంగా తీర్చిదిద్దాలని రైతులకు పిలుపునిచ్చారు. రూ.20,616 కోట్లను రైతుల ఖాతాల్లో వేసి 25 లక్ష?ల మంది రైతులను రుణ విముక్తులను చేశామనీ, ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తూనే సౌరశక్తితో నడిచే పంప్ సెట్లను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రైతు సంక్షేమానికి రూ. 1,56,496 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇప్పటివరకు 63.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సుమారు రూ.11 వేల 903 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. అన్నదాతకు నష్టం రావద్దని దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. యాసంగి సీజన్‌లో దేశంలో సేకరించిన మొత్తం ధాన్యంలో తెలంగాణ వాటా 60 శాతం చెప్పారు. మొక్కజొన్నల కొనుగోళ్లకు సుమారు రూ. 4, 275 కోట్లు, జొన్న కొనుగోళ్లకు రూ.1,154 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించిందని తెలిపారు.

### విద్యపై ఫోకస్

రెండున్నరేండ్లలో 67,763 పోస్టులను భర్తీ చేశామని సీఎం చెప్పారు. ఈ నెలలో టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అటవీశాఖ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, విద్యాశాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించారు. పేదరికం పోవాలన్నా, కుల, మత అంతరాలు తగ్గాలన్నా విద్యయే కీలకమని నొక్కి చెప్పారు. ఫెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో తెలంగాణ మంచి స్థానాన్ని పొందిందని గుర్తుచేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో విద్యా వ్యవస్థ బలోపేతం చేస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా 1,190 మంది విద్యార్థులు కోర్సులు పూర్తి చేయగా 838 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించటం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 2769 స్కూళ్లలో ప్రీ ప్రైమరీ తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ పథకాన్ని అమలు చేస్తామనీ. మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కాలేజీలకు విస్తరించబోతున్నామన్నారు.



# ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి కమిషన్ కట్టుబడి ఉంది.

**● పెండింగ్ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు. ● కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదన. ● రెండేళ్లలో అట్రాసిటీ రహిత జిల్లాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం. ● ఎస్సీ కమీషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ స్వీకరించిన దరఖాస్తులు 62.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

షెడ్యూల్డ్ కులాల ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ పర్యటిస్తోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ తెలిపారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు పాల్గొని షెడ్యూల్డ్ కులాల ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.చిన్నరాముడు, ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షమ్, డా.పి.గౌతం రాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, కమిషన్ స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటోందన్నారు. ప్రజలకు కమిషన్ పర్యటనకు సంబంధించిన సమాచారం చేరవేయడంలో కొంత సమాచార లోపం (కమ్యూనికేషన్ గ్యాప్) ఉన్న విషయాన్ని గుర్తించామని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా ప్రజలకు



సమాచారం చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నంద్యాల జిల్లాలో ఇతర జిల్లాలతో పోల్చితే అట్రాసిటీ కేసుల సంఖ్య తక్కువగా ఉండడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. కమిషన్ వద్ద ఉన్న వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం 53 అట్రాసిటీ కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 11 కేసులకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన 42 కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల నియంత్రణలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొంటూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను చైర్మన్ అభినందించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా, నిందితులకు సకాలంలో శిక్ష పడేలా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రతిపాదన పంపనున్నట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులాలపై ఎలాంటి వివక్ష, వేధింపులు, అట్రాసిటీలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించిన ఆయన, రాబోయే రెండేళ్లలో కర్నూలు, నంద్యాల జిల్లాలను "అట్రాసిటీ ఫ్రీ జోన్"లుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని కమిషన్ సంకల్పించిందన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొని ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం అందే వాతావరణం కల్పించడమే కమిషన్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

### రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు అందిన వినతులు

1)గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన జి. రాజు తమ కుటుంబానికి చెందిన 5 ఎకరాల భూమిని జెఎస్డబ్ల్యూ (జె ఎస్ డబ్ల్యూ) సిమెంట్ పరిశ్రమకు అప్పగించామని, భూమి ఇచ్చిన సందర్భంగా తమకు సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే, ఇప్పటివరకు ఉద్యోగం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొంటూ తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

2)గడివేముల మండలం బిలకలగూడూరు గ్రామానికి చెందిన ఈ. రాజు, సర్వే నెం.260లో తనకు చెందిన ఒక ఎకరం భూమిని జెఎస్డబ్ల్యూ (జిఎస్ డబ్ల్యు) సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. భూమికి సంబంధించి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు అర్జీ సమర్పించారు.

3)మిడ్తూరు మండలం సంకేసుల గ్రామానికి చెందిన ఎం. జయరాముడు తాను ఎలాంటి ఉద్యోగం లేదా వ్యాపారం చేయడం లేదని, ఆదాయపు పన్ను కూడా చెల్లించడం లేదని తెలిపారు. అయినప్పటికీ హౌస్ మ్యాపింగ్‌లో తాను ఆదాయపు పన్ను చెల్లింపుదారుడిగా నమోదై ఉండటంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందడం లేదని పేర్కొన్నారు. సంబంధిత వివరాలను సరిచేసి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో న్యూక్లియస్ కళాశాల విజయదుందుభి




నంద్యాల ప్రతినిధి. జూన్ 02 . (పల్లె వెలుగు ):2026 సంవత్సరానికి గాను ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో న్యూక్లియస్ కళాశాల విద్యార్థులు మరోమారు ప్రతిభ చాటారు. కళాశాల విద్యార్థిని సి.ఎన్. నాగ హర్షిత రెడ్డి ఈడబ్లుఎస్ కేటగిరీలో 5108 ర్యాంకు, బి. సోఫియా బి కేటగిరీలో 10216 ర్యాంకు సాధించారు. ఐఐటీలలో సీట్లు పొందగలిగే ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మురళీధర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్, డైరెక్టర్ వాసుదేవరెడ్డి అభినందించారు. వీరితో పాటు మరికొందరు విద్యార్థులు ఎన్ఐటీ మరియు ఐఐటీలలో సీట్లు పొందగలిగేలా జేఈఈ మెయిన్స్ లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. గతంలో (2025లో) కూడా ఈ కళాశాలకు చెందిన శ్రీరాములు లిఖిత్ ఐఐటీ మద్రాస్, అనీస్ తబస్సుమ్ ఐఐటీ పాలక్కాడ్‌లలో సీట్లు సాధించారు. వీరితో పాటు ప్రదీప్ – ఎన్ఐటీ తేజ్‌పూర్, స్నేహలతారెడ్డి – ట్రిపుల్ ఐటీ ధార్వాడ్, పద్మ మీనాక్షి – ట్రిపుల్ ఐటీ కర్నూలు, సబీరా – ట్రిపుల్ ఐటీ కర్నూలులో సీట్లు పొందారు. అలాగే 2026 ఇంటర్మీడియట్ ఫలితాలలో సైతం ప్రథమ, ద్వితీయ సంవత్సరాల అన్ని గ్రూపులలో ఈ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలు సాధించారు.

## భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించండి



కర్నూలు ప్రతినిధి. జూన్ 02 . (పల్లె వెలుగు ):కర్నూలు వెంకాయపల్లి లో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని కర్నూలు జిల్లా హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు సందర్శించటం జరిగినది. ఆలయ కార్య నిర్వహణ అధికారి రాధాకృష్ణ ని కలిసి ఆలయ జీర్ణోద్ధారణ పనుల గురించి, భక్తుల కనీస సౌకర్యాల గురించి చర్చించటం జరిగినది. శ్రీ ఎల్లమ్మ వారి దర్శనం భక్తులందరికి ఉచిత (క్యూ లైన్ ) వరుసక్రమం లో సంతృప్తికరంగా ఏర్పాటు చేయటం ఆనందదాయకం.అయితే ఒక్క అమ్మవారికి ఇచ్చే బలుల విషయం లో ఇంకా హలాల్ పద్ధతిలో ముస్లిమ్స్ ల చే చేయిస్తుండటం చాలా విచారకరం.వెంటనే హలాల్ పద్దతిని రద్దు పరచి జట్కా పద్దతిలో బలులు ఇవ్వాలని సూచించటం జరిగినది. హలాల్ మరియు జట్కా పద్ధతుల గురించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయమని ఆలయ నిర్వాహకులను కోరటం జరిగినది. ఈ విషయంలో ప్రతి ఒక్క హిందువు బాధ్యతగా తోటి హిందువుకు అవగాహన కల్గించాలి. ఆలయ సముదాయంలో పూజ సామాగ్రి, పూలు మరియు కొబ్బరికాయాల దుఖానాలు దాదాపుగా హిందువులే నిర్వహిస్తున్నారు.రెండు మూడు దుఖానాలు మాత్రం క్రైస్తవాన్ని పాటించేవారు ఉండగా ఈఓ తో వారిని అక్కడనుండి ఖాళీ చేయమని చెప్పించటం జరిగినది. ఈ కార్యక్రమం లో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కర్నూలు జిల్లా అధ్యక్షుడు టి. వి. సురేష్ బాబు, ఉపాధ్యక్షుడు మాలింగిరి గౌతమ్, సహకార్యదర్శి జనార్ధన్, ఆది నారాయణ, శంకర్ తదితరులు పాల్గొనటం జరిగినది.

## ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్.

**● పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులపై ప్రజల సంతృప్తి స్థాయిని స్వయంగా తెలుసుకున్న జిల్లా కలెక్టర్.**

**● నాణ్యమైన పరిష్కారం, ప్రజా సంతృప్తే లక్ష్యం: కలెక్టర్.**

**● ప్రజల అభిప్రాయాల ఆధారంగా సేవల మెరుగుదలకు చర్యలు: కలెక్టర్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) ద్వారా పరిష్కరించబడిన ఫిర్యాదులపై అర్జీదారుల సంతృప్తి స్థాయిని స్వయంగా తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం కలెక్టర్ ఛాంబర్ నుండి అర్జీదారులు సమ్మ నాగేశ్వరరావు, కొల్లి కోటేశ్వరావు, వడ్డే తిమ్మక్క, ఆర్.వి. సుబ్బారావులతో టెలిఫోన్ ద్వారా ప్రత్యక్షంగా మాట్లాడారు. ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత మరియు ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో ఈ ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ ఆక్రమణలు, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ ఓ ఆర్) నమోదు లోపాలు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ పెన్షన్, వాగు



పోరంబోకు భూముల ఆక్రమణ తదితర అంశాలపై అందిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని అర్జీదారుల నుంచే నేరుగా తెలుసుకున్నారు. భూ ఆక్రమణ ఫిర్యాదుకు సంబంధించి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ద్వారా స్థల సర్వే నిర్వహించి హద్దులు, కొలతలు చూపించడంతో సమస్య పరిష్కారమైందని అర్జీదారు తెలిపారు. సంబంధిత అధికారుల చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ పెన్షన్ అంశంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత లేకపోవడంతో పెన్షన్ మంజూరు సాధ్యం కాదని అధికారులు స్పష్టంగా వివరించినట్లు అర్జీదారు పేర్కొన్నారు. వాగు పోరంబోకు భూమి ఆక్రమణ ఫిర్యాదులో సంబంధిత భూమిపై ఆన్‌లైన్ పట్టాదారు/ఎంజాయర్ అప్‌డేషన్ సాధ్యం కాదని అధికారులు తెలియజేసినట్లు అర్జీదారు వివరించారు. అలాగే రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ ఓ ఆర్) కేసుకు సంబంధించి తహసీల్దార్ స్థాయిలో విచారణ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేసినట్లు, ఆ ఉత్తర్వులపై అసంతృప్తి ఉంటే ఆర్‌డీఓ కార్యాలయంలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును నిర్దేశిత కాలపరిమితిలో నాణ్యమైన పరిష్కారంతో ముగించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కార ప్రక్రియలో పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి మరియు అర్జీదారుల సంతృప్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఇటువంటి ప్రత్యక్ష ఫీడ్‌బ్యాక్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## నంద్యాలలో ఇల్లు లేని నిరుపేదల కోసం పోరుబాట సిపిఐ .

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల




పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదల కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు . స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్, సిపిఐ సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు డి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి పి సుశీలమ్మ, మహిళా నాయకురాలు సరోజమ్మ పాల్గొన్నారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు వేల సంఖ్యలో ఉన్నారు. గత సంవత్సరము నుండి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో అన్ని వార్డులలో తిరిగి ఇల్లు లేని వారిని వెరిఫై చేసి వారితో ఇంటి స్థలాల అర్జీలను వ్యక్తిగతంగా సచివాలయాల దగ్గర ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ఇప్పించడం జరిగింది . రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇల్లు లేని వారికి పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి భవన నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇవ్వడం జరిగింది . కానీ ఎన్నికలు అయిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చినాక అద్దోపులి, ఇదో మేక అంటూ ప్రజలను ఊరిస్తూ కాలయాపన చేస్తున్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నంద్యాలలో 4.6.2026. గురువారం ఉదయం 10 గంటలకు సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో విద్యార్థి యువజన ప్రజా సంఘాలతో రైతు వ్యవసాయ కార్మిక ట్రేడ్ యూనియన్లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వారి మద్దతు కూడగట్టి పట్టణంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు వచ్చేంతవరకు పోరాడుతామని అన్నారు .

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకే ,డాక్టర్ ఆర్ వెంకటరమణ జిల్లా వైద్యా ఆరోగ్య ధికారి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.




నంద్యాలలోని జిల్లా వైద్య అధికారి కార్యాలయం నందు పిసిపిఎన్డిటి కమిటీ మీటింగు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే నిర్వాహకుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు .

చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం ప్రోత్సహించడం నేరమన్నారు. సమాజానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఆడబిడ్డ ముఖ్యమని ఆడబిడ్డను రక్షించే బాధ్యత సమాజంలోని ప్రతి పౌరునికి ఉందని తెలియజేశారు. స్కానింగ్ సెంటర్లలో ధరల బోర్డులు ప్రదర్శించాలని సూచించారు .

ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లైన డాక్టర్ శ్రవణ్ కుమార్ రేడియాలజిస్ట్, డాక్టర్ లక్ష్మీనారాయణ చిన్నపిల్లల వైద్యులు, డాక్టర్ సలీమున్నీసా బేగం గైనకాలజిస్ట్, జిల్లా మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామన్న, బర్డ్స్ , మరియు మదర్ సొసైటీ స్వచ్ఛంద ప్రతిని దులు, వంశీ పాల్గొన్నారు.

## రాయలసీమలో యాదవులకు రాజ్యసభ సీటు కేటాయించాలి



నంద్యాల ప్రతినిధి. జూన్ 02 . (పల్లె వెలుగు ): రాయలసీమలో యాదవులకు రాజ్యసభ సీటు కేటాయించాలని టీడీపీని డిమాండ్ చేసిన అఖిల భారత యాదవ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు.రాయలసీమ ప్రాంత యాదవులకు రాజ్యసభలో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ ఒక రాజ్యసభ సీటును కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ నంద్యాల జిల్లా నాయకులు తెలుగుదేశం పార్టీని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా యాదవ నాయకులు మాట్లాడుతూ, యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు రాయలసీమ యాదవులకు రాజ్యసభ సీటు కేటాయించాలని కోరారు. ఆ సీటుకు మాజీ ఎమ్మెల్సీ, మాజీ జెడ్పీ చైర్మన్, అనంతపురం జిల్లా ప్రముఖ యాదవ నాయకుడు గుండుమల్ల తిప్పయ్య స్వామి యాదవ్ అర్హుడని పేర్కొన్నారు.యాదవులు తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచీ అండగా నిలుస్తూ వస్తున్నారని, యువత కూడా పెద్ద సంఖ్యలో పార్టీతో అనుబంధం కలిగి ఉందని తెలిపారు. ఇటువంటి సమయంలో యాదవ సామాజిక వర్గానికి రాజ్యసభ సీటు కేటాయించడం ద్వారా వారి మనోధైర్యాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చినట్లవుతుందని అభిప్రాయపడ్డారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయంపై సానుకూలంగా స్పందించి, గుండుమల్ల తిప్పయ్య స్వామి యాదవ్‌ను రాజ్యసభకు పంపించేలా తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి ఫౌండర్ చైర్మన్ డాక్టర్ చింతల మోహన్ రావు యాదవ్, యాదవ సంఘం జిల్లా నాయకులు, శ్రీకృష్ణ టెంపుల్ అధ్యక్షులు కృష్ణ యాదవ్, నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విజయ గౌరీ యాదవ్, చంద్రుడు యాదవ్, కాజా శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాసరావు, మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు ఆలయంలో ఎమ్మెల్యే గారు

### దంపతుల తనయుడు జనార్దన్ రెడ్డి పూజలు..



పాణ్యం జూన్ 2 పల్లె వెలుగు : మండలం పరిధిలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరితా,వెంకట్ రెడ్డి దంపతుల తనయుడు గౌరు జనార్దన్ రెడ్డి దంపతులు మంగళవారం సతీ సమేతంగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వీరికి ఆలయ ఈవో రామకృష్ణ, ఆలయ అర్చకులు సురేష్ స్వామి,గ్రామ పెద్దలు మిలటరీ సుబ్బారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారికి అభిషేకములు,అర్చనలు పూజలు నిర్వహించి పూలమాల,శాలువతో సత్కరించి దంపతులకు స్వామి వారి తీర్థ ప్రసాదములు అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ప్రధాన అర్చకులు వీరయ్య స్వామి, శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులకు

### అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

**మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ సూచన**



హోళగుంద పల్లె వెలుగు జూన్ 02 తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ సూచించారు. వ్యవసాయ శాఖ మార్గదర్శకాల ప్రకారం తక్కువ మరియు మధ్యస్థ వర్షపాతం పరిస్థితుల్లో సాగు చేయదగిన పంటలు, వాటికి అనువైన విత్తే తేదీల వివరాలను రైతులకు తెలియజేశారు.తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, పెసలు, చిరుధాన్యాలు, జొన్న, కంది, ఆముదం వంటి పంటలను జూలై 31వ తేదీలోపు విత్తుకోవాలని తెలిపారు. అలాగే వేరుశనగతో పాటు కంది, సజ్జ, ఆముదం అంతర పంటలుగా సాగు చేసినా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. పెసలను జూన్ 30వ తేదీలోపు విత్తడం ఉత్తమమని సూచించారు.మధ్యస్థ వర్షపాతం ప్రాంతాల్లో జొన్న, మాఘి జొన్న, ఆముదం, కంది, కొర్ర, రాగి, సజ్జ, ప్రత్తి వంటి పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. జొన్న, ఆముదం, కంది, సజ్జ, ప్రత్తి పంటలను జూలై 31లోపు, మాఘి జొన్నను సెప్టెంబర్ 30లోపు, కొర్ర--సజ్జ మిశ్రమ పంటలను జూన్ 30లోపు విత్తాలని సూచించారు. పెసర, మినుము పంటలను జూలై 15లోపు విత్తడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు.వాతావరణ పరిస్థితులను గమనిస్తూ, నేల స్వభావానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని సాగు చేపట్టాలని రైతులకు సూచించిన మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్, మరిన్ని వివరాల కోసం సమీప రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

# సైకిల్ రథం -- పర్యావరణ పథం



పల్లె వెలుగు:సైకిల్ రెండు శతాబ్దాలుగా మానవాళికి సేవలందిస్తున్న సరళమైన, చౌకైన, నమ్మకమైన పర్యావరణహిత రవాణా సాధనం. రెండు చక్రాల ఈ ప్రయాణం ఆరోగ్యానికి అసలైన మార్గం. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల నేపథ్యంలో సైకిల్ వినియోగం ఇంధనంతో పాటు డబ్బును కూడా ఆదా చేస్తుంది. ఇంధనం అవసరం లేదు, కాలుష్యం సృష్టించదు. అందుకే సైకిల్ పర్యావరణానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించగలిగే సైకిల్ అందరికీ స్నేహితుడే. 2026 సంవత్సరానికి “పచ్చని భవిష్యత్తు కోసం సైకిల్” అనే థీమ్‌ను స్ఫూర్తిగా తీసుకొని కాలుష్యరహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిదీ. సున్నా ఉద్గారాలతో నడిచే సైకిల్ భూమిని కాపాడే కవచంలా నిలుస్తుంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్య నియంత్రణలో సైకిల్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల శారీరక వ్యాయామం లభించి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆధునిక జీవనశైలి కారణంగా పెరుగుతున్న అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. సైకిల్ తొక్కడం వల్ల గుండెజబ్బులు, మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు కండరాలకు బలం చేకూరుతుంది. పేద, ధనిక, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరికీ అందుబాటులో ఉండే సులభమైన వాహనం సైకిల్. ఇది చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే మధురమైన ప్రయాణ సహచరి. “సైకిల్ తొక్కుదాం సగర్వంగా... కారు వద్దు, సైకిల్ ముద్దు”లిలి అనే సందేశంతో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలి. ఆడంబరాలకు దూరంగా ఉండి ఆరోగ్యానికే ప్రాధాన్యం ఇవ్వాలి. ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తించి సైకిల్‌ను మన దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలి. కాలుష్యరహిత పర్యావరణం, ఆరోగ్యవంతమైన సమాజం కోసం సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహిద్దాం. సైకిల్ తొక్కుతూ ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుతూ ఆరోగ్య భారత నిర్మాణానికి తోడ్పడుదాం. -- నేదునూరి కనకయ్య అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం రచయిత, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, కరీంనగర్.

# ఇక ఆటలు సాగవు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 2: అన్న చెప్పాడు. నాకు 20 మూటలు ఏరియా కావాలి.



వెంటనే నా మనిషి వస్తాడు ఎత్తి పంపించండి. అంటూ అధికారులకు హుకూం చేస్తున్న గ్రామస్థాయి నాయకుల ఆగడాలు ఇక చెక్ పడినట్లే! ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో యూరియా పంపిణీ చేసే సమయంలో, రాజకీయ నాయకుల నుండి వచ్చే సిఫారసులతో, బెదిరింపులతో వ్యవసాయ సిబ్బంది పడుతున్న అవస్థలు చెప్పనవసరం లేదు. రాజకీయ నాయకుల ఒత్తిడితో, మానసికంగా కృంగిపోయి, క్రింది స్థాయి సిబ్బంది కొన్ని సందర్భాలలో ఉద్యోగాలకు సెలవు పెట్టి వెళ్లిపోవాలన్న సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. రైతులకు సక్రమంగా, అందరికీ యూరియాను పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో పాటు ఎరువుల అమ్మకాలలో అక్రమాలకు పెట్టడానికి ప్రభుత్వం కొత్తగా డిజిటల్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఎరువుల పంపిణీ యాప్ పై, అక్రమ తరలింపు, వ్యవసాయేతర వినియోగం, బ్లాక్ మార్కెటింగ్ అవసరానికి మించి కొనుగోలను నియంత్రించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ ను రూపొందించడం జరిగింది. కౌలు రైతులతో సహా అసలైన సాగుదారులకు రాయితీ ఎరువులను అందించడానికి ఎరువుల వినియోగాన్ని సమర్ధవంతంగా పర్యవేక్షించడానికి ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం 2.0 ద్వారా ఎరువుల పంపిణీ వ్యవస్థ డిజిటల్ పద్ధతిలో రైతులు తమకు కావాల్సిన ఎరువులను ముందుగానే యాప్ లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి రైతుకు సీజన్లో గరిష్టంగా 50 బస్తాల ఎరువులు అందేలా ఈ ఏపీ ఎయిమ్స్ యాప్ను ప్రభుత్వం రూపొందించింది. జాతీయ స్థాయిలో ఎఫ్ఎంఎస్ పోర్టల్తో అనుసంధానం చేస్తూ, ఈ యాప్ను రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ యాప్ లో ఎరువులు నమోదు చేసుకుంటే ఎంఆర్పి ధర ప్రకారము డబ్బును ఆన్లైన్ ద్వారా లేదా ఆన్లైన్ షాపులో చెల్లించవచ్చు. వంట దశను బట్టి యాప్ ద్వారా డోకెంట్ జారీ అవుతుంది. టోకెన్ ఉంటేనే ఎరువులను తీసుకునే అవకాశం ఉంటుంది. రైతులు కావాల్సిన ఎరువులను సమీప డీలర్ వద్ద డెలివరీ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. దీనివల్ల యూరియా డిఏపి వంటి ఎరువుల డిమాండ్పై వ్యవసాయ శాఖకు ఖచ్చితమైన సమాచారం అందుతుంది. అలాగే ఈ పంట నమోదు ప్రామాణికంగా ఎంత విస్తరణంలో రైతులు పంటలు వేశారు, ఎరువులు ఎంత కొనుగోలు చేశారు అన్న సమాచారం కూడా తెలుస్తుంది. దీన్నిబట్టి ఎరువుల ప్రణాళిక తయారు చేయడం సులభమవమంతం అవుతుంది. రానున్న ఖరీఫ్ సీజన్ నుంచి ఈ విధానం అమలు అవుతుంది. ఈ సందర్భంగా బండి ఆత్మకూరు మండలం వ్యవసాయ అధికారి స్థానిక ఏవో కార్యాలయంలో ఎరువుల పంపిణీ యాప్ పై రైతు సేవా కేంద్రం సిబ్బందికి వ్యవసాయాధికారి పవన్ కుమార్ అవగాహన సదస్సును నిర్వహించారు. బండి ఆత్మకూరు మండలంలో 32వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని, బోరు బావులు ఉన్న రైతులు వరి నర్సరీ వేయకుండా నేరుగా డ్రై షోయింగ్ పద్ధతిలో వరి సాగు చేసుకోవాలని, దీని ద్వారా సాగునీరు కూలీల ఖర్చులు ఇతర మందుల ఖర్చులు కూడా ఆదా అవుతాయని రైతులకు వివరించాలని సి బ్బందికి సూచించారు. ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో 50 ఎకరాలు డ్రై షోయింగ్ పద్ధతిలో వరి సాగు చేయించాలని ఆ విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి ఏవో సూచించారు. ప్రతి ఎల్నినో పరిస్థితుల వలన వర్షాలు తక్కువగా ఉంటాయి కాబట్టి, రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు లక్ష్మయ్య, హిమబిందు అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది శ్రీనివాసులు,రామకృష్ణ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# రూ.62.20 కోట్ల సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ.

- భూసార పరిరక్షణకు కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం .
- రైతులకు పెట్టుబడి భారం తగ్గించి అధిక దిగుబడులే లక్ష్యం.
- పచ్చిరొట్ట సాగుతో నేల సారం పెంపు, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు.
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.




పల్లె వెలుగు అమరావతి. రైతు సంక్షేమం, భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్--2026 సీజన్‌లో పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రైతులకు అవసరమైన మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.62.20 కోట్ల సబ్సిడీని కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 91,918 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు కేటాయించగా, అందులో జీలుగ 50,311 క్వింటాళు ,, జనుము 21,291 క్వింటాళ్లు, పిల్లి పెసర 20,316 క్వింటాళ్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 40,459 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయగా, 19,667 మంది రైతులకు 5,687 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసి రూ.4.76 కోట్ల సబ్సిడీ ప్రయోజనాన్ని అందించినట్లు చెప్పారు.

పచ్చిరొట్ట పంటలు నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి వివరించారు. ఈ పంటలను భూమిలో కలపడం ద్వారా సేంద్రియ కార్బన్ శాతం పెరగడంతో పాటు నత్రజని నిల్వలు అధికమవుతాయని తెలిపారు. దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గి, రైతుల సాగు వ్యయం నియంత్రణలో ఉండటమే కాకుండా భూముల ఉత్పాదకత కూడా గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. సహజ, సేంద్రియ వ్యవసాయ విధానాల పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ పంటల ప్రాముఖ్యతను వివరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహానికి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.

కృష్ణా, గుంటూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, ఏలూరు, బాపట్ల, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది రైతులు ఇప్పటికే లబ్ధి పొందినట్లు మంత్రి వెల్లడించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాల సరఫరాను మరింత పెంచి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని కేవలం జీవనాధార రంగంగా కాకుండా ఆదాయాన్ని పెంచే రంగంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నాణ్యమైన విత్తనాల పంపిణీ, సబ్సిడీ పథకాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నీటి వనరుల సమర్థ నిర్వహణ, భూసార పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటే రైతు అభివృద్ధి చెందుతాడు.. రైతు అభివృద్ధి చెందితే రాష్ట్రం పురోగమిస్తుంది అనే సంకల్పంతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# అట్రాసిటీలు, కుల వివక్షకు తావులేకుండా సమానత్వ సమాజ నిర్మాణానికి అధికారులు కృషి చేయాలి.

- ప్రజల పట్ల సహానుభూతితో స్పందించి పిటిషన్లను సకాలంలో పరిష్కరించాలి.
- నంద్యాల, కర్నూలు జిల్లాలను అట్రాసిటీ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.
- ఎస్సీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.
- అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రతిపాదన.
- ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్.








**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, కుల వివక్ష నిర్మూలన మరియు ఎస్సీ/ఎస్టీ చట్టాల సమర్థ అమలుపై అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్ అన్నారు. ప్రజల సమస్యల పట్ల సహానుభూతితో స్పందిస్తూ, పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, పీసీఆర్ యాక్ట్ అమలు, భూ సమస్యలు, రిజర్వేషన్ల అమలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆర్డీఓలు, డీఎస్పీలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మరియు జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఎస్సీ కమిషన్ కార్యదర్శి ఎస్. చిన్న రాముడు, కమిషన్ సభ్యులు మేకల భిక్షం, డా. పి. గౌతం రాజు, డీఆర్ఓ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కమీషన్ ఛైర్మన్ జవహర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కుల వివక్ష వివిధ రూపాల్లో కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వం సాధించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మరింత చొరవతో పనిచేయాలని సూచించారు. ప్రజల పట్ల సానుభూతి, సేవాభావం అధికారుల్లో ఉండాలని, "రేపటి పని ఈరోజే చేయి – ఈరోజు పని ఇప్పుడే చేయి" అనే సూత్రంతో విధులు నిర్వర్తించాలని కోరారు. నంద్యాల, కర్నూలు జిల్లాలను అట్రాసిటీ రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, ఈ ప్రాంతంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

"జిల్లాలో మొత్తం 61 పిటిషన్లు అందగా, వాటిలో ఎస్సీ కమిషన్ కార్యదర్శికి 2, జిల్లా కలెక్టర్‌కు 47, జిల్లా ఎస్పీకి 11, నంద్యాల ఆర్డీఓకు 1 పిటిషన్ చొప్పున అందినట్లు తెలిపారు. అందిన పిటిషన్లలో కేవలం 11 కేసులకు మాత్రమే యాక్షన్ టేకెన్ రిపోర్టులు (ఏటీఆర్లు) సమర్పించబడగా, మిగిలిన కేసులకు సంబంధించిన నివేదికలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు." కమిషన్ నుంచి వచ్చిన ప్రతి నోటీసుకు సకాలంలో స్పందించి ఏటీఆర్‌లు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక అధికారిని నియమించి కమిషన్‌తో సమన్వయం కొనసాగించాలని సూచించారు. అట్రాసిటీలు కేవలం కుల వివక్ష రూపంలోనే కాకుండా భూమి, ఆర్థిక మోసాలు, సేవా సంబంధిత అంశాల్లో కూడా జరుగుతున్నాయని తెలిపారు. తప్పుడు కేసులు, వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకు కమిషన్ తరఫున ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలను గ్రామాలకు పంపనున్నట్లు వెల్లడించారు. ప్రజల ముందు అధికారులు ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడంలో అధికారులు చూపే నిబద్ధతే ప్రజల విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ/ఎస్టీ పీఓఏ చట్టం అమలు, భూ సమస్యల పరిష్కారం, రిజర్వేషన్ల అమలు, పీజీఆర్ఎస్ పిటిషన్ల పరిష్కారం, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాలో సుమారు 19.30 లక్షల జనాభా ఉండగా, అందులో 18 నుంచి 19 శాతం వరకు షెడ్యూల్డ్ కులాల జనాభా ఉన్నట్లు వివరించారు. జిల్లాలో 7 నియోజకవర్గాలు, 4 రెవెన్యూ డివిజన్లు, 30 మండలాలు, 6 అర్బన్ లోకల్ బాడీలు, 489 గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసే దిశగా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ఎస్సీలపై జరిగే నేరాల సంఖ్య గత రెండేళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గినట్లు తెలిపారు. 2024లో 117 కేసులు నమోదవగా, 2025లో 71 కేసులకు తగ్గాయని, 2026 ఏప్రిల్ 30 నాటికి కేవలం 8 కేసులు మాత్రమే నమోదయ్యాయని వివరించారు. శారీరక దాడులు, లైంగిక దాడుల కేసుల్లో కూడా స్పష్టమైన తగ్గుదల నమోదైందన్నారు. జిల్లాలో మొత్తం 46 అండర్ ఇన్వెస్టిగేషన్ (యు ఐ) కేసులు ఉండగా, వాటిలో 31 కేసులకు చార్జ్‌షీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. మిగిలిన కేసులు సాక్షుల విచారణ, భూ రికార్డుల సేకరణ, కోర్టు స్టేలు తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

పశుసంవర్ధక శాఖ ద్వారా జిల్లాలో ఎస్సీ లబ్ధిదారులకు మంజూరైన గోకులాల వివరాలను ఎస్సీ కమిషన్ ఛైర్మన్ అడిగి తెలుసుకున్నారు. గోకులాల ద్వారా పాడి రైతుల ఆదాయం పెరగడంతో పాటు వర్మీ కంపోస్ట్ తయారీ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లాలో ఎస్సీ లబ్ధిదారులకు సీనియారిటీ జాబితా ప్రకారం ఇప్పటివరకు 46 బోరు కనెక్షన్లు మంజూరు చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వివరించారు.

పదో తరగతి ఫలితాలపై సమీక్షిస్తూ, ఉత్తీర్ణత శాతం మరియు విద్యార్థుల సంఖ్యపై డీఈఓను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలుగు సబ్జెక్టులో ఎక్కువ మంది విద్యార్థులు విఫలమైన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రుద్రవరం మండలానికి చెందిన మధ్యాహ్న భోజన పథకం ఆయాకు ఐదు నెలలుగా వేతనం అందలేదన్న ఫిర్యాదుపై విచారణ జరిపారు. వేతనం బ్యాంకు ఖాతాలో జమ చేసినప్పటికీ ఉపసంహరించుకోలేదని అధికారులు వివరించగా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హార్టికల్చర్, సూక్ష్మ నీటిపారుదల పథకాల కింద అవసరమైన గుంతల తవ్వకాలను ఉపాధి హామీ పథకం ద్వారా చేపడితే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని సూచించారు.

ఎస్ఆర్‌బీసీ కార్యాలయంలో కారుణ్య నియామకంలో చేరిన ఉద్యోగి సర్వీసు రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన వినతిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

జిల్లాలోని 120 మత్స్యకార సంఘాల్లో ఎస్సీ సంఘాలు కేవలం మూడు మాత్రమే ఉన్నాయని, వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా మరిన్ని సంఘాలకు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగి ఎం. కరుణయ్యకు పదోన్నతి ఇచ్చినప్పటికీ పోస్టింగ్ ఇవ్వలేదన్న ఫిర్యాదుపై స్పందిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఆర్ఎంను ఆదేశించారు.

# ఓటరు జాబితాల ప్రక్షాళనతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ:

## డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

- మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో 'సార్' (SIR) వర్క్‌షాప్
- హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులి, డోన్ ఎమ్మెల్యే కోట్ల






పల్లె వెలుగు–డోన్ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమని, నకిలీ ఓట్ల తొలగింపు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్) అవగాహన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల ప్రక్షాళన, నకిలీ మరియు అనర్హ ఓటర్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పెంపు వంటి అంశాలపై నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు.

**సమన్వయంతో పనిచేయాలి:**

కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదయ్యేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. డోన్ నియోజకవర్గంలో ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

**దిశా నిర్దేశం చేసిన ముఖ్యమంత్రి:**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధుల బాధ్యతలను ఆయన గుర్తుచేశారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేలా, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేలా ఎమ్మెల్యేలు అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి...



హోళగుంద పల్లె వెలుగు జూన్ 02 హోళగుంద మండల కేంద్రంలోని సాయిబన్న దర్గా వద్ద కొంతకాలంగా యాచిస్తూ జీవనం సాగిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, కొన్ని రోజులుగా దర్గా పరిసరాల్లో ఉంటున్న ఆ వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో మూడు రోజుల క్రితం హెబ్బటం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం చేర్పించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం సోమవారం 108 అంబులెన్స్ ద్వారా ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి పేరు, చిరునామా తదితర వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తుపట్టినట్లయితే లేదా అతనికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే హోళగుంద పోలీస్ స్టేషన్‌ను లేదా హోళగుంద ఎస్సైను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు

# ఆర్మీ జవాన్ కు ఘన సన్మానం..

**అపూర్వ స్వాగతం పలికిన గ్రామస్తులు.**





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ పగిడి శివకుమార్ ఉద్యోగ విరమణ పొందడంతో మంగళవారం గ్రామస్తులు అపూర్వ ఘన స్వాగతాన్ని పలికి పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా కేకు కోసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం నాయకులు కలిసి పూలమాలలు, శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ..శివ కుమార్ దేశ సరిహద్దులను కాపాడుతూ నిస్వార్థంగా విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవ చేసిన జవాన్ల త్యాగాలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. పదవి విరమణ పొందడం ఒక గర్వించదగ్గ సందర్భమని, ఇలాంటి సైనికులను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, క్రాంతి కుమార్, గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, మారెడ్డి రామయ్య, నల్లబోతుల మల్లికార్జున, మారెడ్డి సుబ్రహ్మణ్యం, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిని రూపుమాపేందుకు ప్రజలు సహకరించాలి: కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థలో అవినీతిని సమూలంగా రూపుమాపేందుకు ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ విభాగంలో ఆస్తి పన్ను, వి.ఎల్.టి. విధింపు, పన్ను సవరణ, పేరు మార్పు తదితర సేవలతో పాటు పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, జనన-మరణ ధ్రువీకరణ పత్రాల జారీ వంటి ఏ విభాగంలోనైనా సేవల కోసం ఎవరైనా అధికారి లేదా ఉద్యోగి డబ్బు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. నగరపాలక సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 9766కు లేదా నేరుగా కమిషనర్ సెల్ నంబర్ 8106228899 కు కాల్, ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్ సందేశం ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అవసరమైతే ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, అందిన ప్రతి ఫిర్యాదుపై తానే సమగ్ర విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సేవల కోసం ఎవరికీ డబ్బులు చెల్లించవద్దని, అవినీతి నిర్మూలనలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు.

# కారు బోల్తా ఇరువురికి గాయాలు





నంద్యాల క్రైమ్. జూన్ 02 . (పల్లె వెలుగు ):నంద్యాల పట్టణ శివారులోని రైతు నగరం వద్ద మంగళవారం సాయంత్రం కారు బోల్తా పోవడంతో ఇరువురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. సమాచారం మేరకు హైదరాబాద్ కు చెందిన టీజీ 08.ఎస్ 9966 మహేంద్ర ఎక్స్యువి కారు తిరుమల వెంకటేశ్వర స్వామి ని దర్శించుకుని హైదరాబాద్ వెళుతుండగా నంద్యాల పట్టణ శివారు ప్రాంతం రైతు నగర్ వద్ద ముద్దుగా వెళ్తున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో దాని తప్పించే బోయి డివైడెడ్ ఢీకొనడంతో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

# మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి

**-నూతన విత్తన శుద్ధి, నిల్వ యూనిట్ల ప్రారంభోత్సవంపై చర్చ**



పల్లె వెలుగు – డోన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ను ఏపీ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన విత్తన శుద్ధి విత్తన నిల్వ యూనిట్ల (గోదాములు) ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి మంత్రి అచ్చెన్నాయుడుతో సుదీర్ఘంగా చర్చించారు. రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా అత్యాధునిక వసతులతో వీటిని సిద్ధం చేసినట్లు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ నూతన గోదాములు, శుద్ధి కేంద్రాలను ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని, తద్వారా విత్తన కొరత లేకుండా ముందస్తు నిల్వలు ఉంచేందుకు వీలవుతుందని మంత్రి అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్పొరేషన్‌కు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# సమాజాభ్యున్నతికి ధర్మమే పునాది



ఆస్పరి. జూన్ 02 . (పల్లె వెలుగు ):ధర్మం అంటే వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశ శ్రేయస్సుకు మార్గదర్శకమైన జీవన విధానమని, ధర్మబద్ధమైన ఆలోచనలు, నైతిక విలువలు, పరస్పర గౌరవం, సేవాభావం ఉన్నచోటే శాంతి, సౌభ్రాతృత్వం, సర్వాంగీనాభివృద్ధి సహజంగా వికసిస్తాయని, ధర్మం వ్యక్తిని సద్గుణవంతునిగా తీర్చిదిద్దుతుందని, సద్గుణవంతులైన వ్యక్తులే ఆదర్శ కుటుంబాలను నిర్మిస్తారని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఆస్పరి మండలం, డి.కోటకొండ గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం స్థానిక భజన మండలి నిర్వహించిన భజనలు, స్వాత్మానందస్వామి చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కె.గంగాధర రెడ్డి, డి.కె.హనుమంతు, కొండారెడ్డి, రామాంజనేయులు, అర్చకులు శ్రీనువాసులు, గోపాల్,రామిరెడ్డితోపాటు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## చిన్న దేవళాపురం కార్యదర్శిగా శ్రీవిద్య



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 2: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న చిన్నదేవులాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా శ్రీవిద్యను నియమిస్తూ ఉమ్మడి జిల్లాల కలెక్టర్ ఏ సిరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బండి ఆత్మకూరు సచివాలయం 2 లో గ్రేడ్ 5 కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీవిద్యకు గ్రేడ్ 4 కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన శ్రీవిద్యను సచివాలయ సిబ్బంది అభినందించారు.

# పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ ..





గడివేముల పల్లె వెలుగు దిన పత్రిక నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలం పెసరవాయి టిడిపి నాయకురాలు ఒడ్డు లక్ష్మీదేవి ఆధ్వర్యంలోగ్రామములో 825 పంపిణీ కార్యక్రమం చేపట్టారు,మరియు గడివేముల గ్రామములో 612 రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకములు గడివేముల మండల తాసిల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో పంపిణి కార్యక్రమం పట్టాదారు ఈకేవైసీ చేయించి పంపిణీ చేయడము జరిగిందని మండల వెంకటరమణ సచివాలయ , రెవిన్యూ,అధికారులు గ్రామ ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు..

# రెసిడెన్షియల్ విద్యాసంస్థలను నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలి.

**పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధితోనే స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధ్యం.**

**- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, హాస్టళ్లను రాబోయే రెండేళ్లలో "నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్‌లు ( ఎన్ జెడ్ హెచ్ సి)"గా అభివృద్ధి చేసి పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యత, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతా భావం పెంపొందించడం ద్వారా స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అన్నారు. మంగళవారం జిల్లా హెచ్‌ఆర్‌డీ కేంద్రంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల మేరకు పర్యావరణ పరిరక్షణ, హరితావరణ విస్తరణ, సూక్ష్మ వాతావరణ మెరుగుదల, కార్బన్ తగ్గింపు లక్ష్యాలతో అల్ట్రా హై డెన్సిటీ (యూహెచ్‌డీ) ప్లాంటేషన్ – అనంత అరణ్య మోడల్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) మరియు వీబీ–గ్రామ్ జి ద్వారా జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ వివరించారు. మొక్కలు నాటడం అంటే కేవలం హరిత కార్యక్రమం కాదని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పచ్చదనం పెరగడం ద్వారా గాలి నాణ్యత మెరుగుపడి ప్రజారోగ్యానికి మేలు జరగడమే కాకుండా, ఉత్పాదకత పెరిగి ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. మొక్కల పెంపకం వల్ల నేల సారవంతం పెరగడం, భూగర్భ జలాల నిల్వలు మెరుగుపడడం, పర్యావరణ సమతుల్యత నెలకొనడం, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అనుబంధం పెరగడం వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. "వేస్ట్ టు వెల్త్" భావనను ప్రతి విద్యాసంస్థలో ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. సర్క్యులర్ ఎకానమీ ద్వారా వ్యర్థాలను సంపదగా మార్చే విధానాలపై అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ సృష్టిలో ఏదీ వ్యర్థం కాదని, ప్రతి వనరును పునర్వినియోగం చేస్తూ గరిష్ట ప్రయోజనం పొందడమే సుస్థిర అభివృద్ధి లక్ష్యమని వివరించారు.జిల్లాలో మట్టి సారవంతం పెంపు కోసం బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. వ్యవసాయ వ్యర్థాలు, కొబ్బరి బోండాలు వంటి పదార్థాలతో తయారుచేసే బయోచార్ నేలలో కార్బన్ శాతాన్ని, గుల్లదనాన్ని పెంచి దిగుబడులు మెరుగుపరుస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు అధిక ఆదాయాన్ని అందించే ఉద్యాన పంటలు, ఆధునిక సాంకేతిక వ్యవసాయ విధానాల వైపు రైతులు అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఖర్జూరం, మెకాడమియా నట్స్, చామంతి వంటి అధిక విలువ కలిగిన పంటల సాగుతో రైతులు విశేష లాభాలు పొందుతున్నారని తెలిపారు.జిల్లా స్థూల ఆర్థికోత్పత్తి (జీడీపీ) పెరుగుదలలో హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న నంద్యాల జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా మరింత ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక వ్యవసాయం, సహజ వనరుల సమర్థ వినియోగం ద్వారా జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, హాస్టల్ సంక్షేమ అధికారులు, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బి ఎల్ ఏ ల అవగాహన సదస్సు.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి దిశానిర్దేశంలో.. నియోజకవర్గ స్థాయి దీూా (దీశీశ్రీ్త ్రావజవశ్రీ ూాస్త్రవత్‌ం)లకు ఎస్ ఐ ఆర్ పై కీలక అవగాహనా సమావేశం అన్నపూర్ణ హోటల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గము నుండి వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర పార్టీ కార్యాలయ ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎస్ ఐ ఆర్ సర్వే పై బి ఎల్ ఏ లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, సిఇసి సభ్యుడు పీపీ నాగిరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి, నంద్యాల అసెంబ్లీ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో బి ఎల్ ఏ లు.. బి ఎల్ ఓ లను ఎలా సమన్వయం చేసుకోవాలనే దానిపై దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని, కుట్రపూరితంగా ఓటర్ల పేర్లను తొలగించకుండా, తీసుకోవాల్సిన చట్టపరమైన అంశాలను, జాగ్రత్తలను వైసిపి ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో కొత్తగా నియమితులైన బి ఎల్ ఏ లు, పార్టీ సీనియర్ నాయకులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రెటరీ రత్నబాబు చౌదరి, గోస్పాడు ఎంపీపీ ఆర్థర్ సైమన్, నంద్యాల జిల్లా వైసీపీ కార్యవర్గ సభ్యులు, నంద్యాల మండల అధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, గోస్పాడు మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు, మాజీ సర్పంచ్లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- కర్నూలులో క్రైస్తవుల భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా
- అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీఎం చంద్రబాబుకు డిమాండ్
- మద్దతు ప్రకటించిన బీఎస్పీ జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే డిమాండ్‌తో కర్నూలు నగరంలో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. కర్నూలు పొలము బాప్టిస్ట్ సంఘముల సమాజం ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్రైస్తవ నాయకులు, విశ్వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనకు బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్ పూర్తి మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల నాయకులు ఎస్. జయ కాంత్ క్రిస్టియన్, ఎ. ప్రభుదాస్, మరియు బీఎస్పీ నాయకుడు గాడి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును డిమాండ్ చేశారు. ఇందుకోసం రాష్ట్ర అసెంబ్లీలో తక్షణమే తీర్మానం ప్రవేశపెట్టి, దానిని కేంద్రానికి పంపాలని వారు కోరారు.

**రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన: అరుణ్ కుమార్**

బీఎస్పీ జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరునికి సమానత్వ హక్కు (ఆర్టికల్ 14), వివక్షకు వ్యతిరేక రక్షణ (ఆర్టికల్ 15), మత స్వేచ్ఛ (ఆర్టికల్ 25) కల్పించబడ్డాయని గుర్తుచేశారు. అయితే, 1950 నాటి ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం ఎస్సీ హోదాను కేవలం హిందూ మతానికి మాత్రమే పరిమితం చేయడం అన్యాయమన్నారు. మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదని, కానీ వారికి లభించే రిజర్వేషన్లు, ప్రభుత్వ ప్రయోజనాలు నిలిపివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. కేవలం మతం మారారనే కారణంతో పేదరికం పోయి ఎవరూ ధనవంతులు కాలేరని, ఈ వివక్షను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**క్రైస్తవ సంఘాల ప్రధాన డిమాండ్లు:**

1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను సవరించి, దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలి.

మత స్వేచ్ఛను గౌరవిస్తూ, మతం మారిన దళితులపై జరుగుతున్న వివక్షకు చరమగీతం పాడాలి.

ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తగిన విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటూ, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక పంపాలి.

ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, దళిత నాయకులు మరియు క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

## డిగ్రీ,పీజీ కళాశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి



నంద్యాల ప్రతినిధి. జూన్ 02 . (పల్లె వెలుగు):నేషనల్ పీజీ కళాశాలలో ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు కట్టలేదని సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నరాని తక్షణమే నేషనల్ డిగ్రీ పీజీ కళాశాల యాజమాన్యం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శ్యాముల్ జవహర్ ని కలిసి సమస్య వివరించడం జరిగిందని తక్షణమే ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కలెక్టర్ తో మరియు కళాశాల యాజమాన్యంతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించడం జరిగిందని అయితే కళాశాల యాజమాన్యం మాత్రం డబ్బులు కట్టాల్సిందే అని విద్యార్థిని వేధిస్తున్నారని ఇది నిబంధనలకు వ్యతిరేకమని మేము విద్యార్థి సంఘాలుగా ఆరోపిస్తున్నాం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులను ఫీజులు కట్టలేదని వేధించకూడదని అలాగే వారి సర్టిఫికెట్లు కళాశాలలో పెట్టుకునే హక్కు కళాశాల యాజమాన్యాలకు లేదని గతంలోనే అన్ని కళాశాలలకు నోటీసులు ఇచ్చిన యాజమాన్యాలు మాత్రం మంత్రి మాటను లెక్కచేయకుండా విద్యార్థులను వేధిస్తూ వారి సర్టిఫికెట్లను ఇవ్వకుండా వారి జీవితాలను నాశనం చేసేలా చేస్తున్నారని తక్షణమే అటువంటి కళాశాలలపై చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి విద్యార్థులకు న్యాయం చేయాలని మంగళవారం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ నంద్యాలకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాల్లో కలిసి సమస్యను వివరించడం జరిగిందని తెలిపారు.తక్షణమే కళాశాల అధ్యయనం ఆ విద్యార్థినికి సర్టిఫికెట్లు ఇవ్వాలని లేకుంటే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుదామని కళాశాల యాజమాన్యాంకు పిడిఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, జిల్లా కార్యదర్శి సురేష్ హెచ్చరించారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ



రంగారెడ్డి జిల్లా, శివరాంపల్లి -- పల్లె వెలుగు ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శివరాంపల్లిలోని లిలిశ్రీ సరస్వతి విద్యాపీఠంలోలిలి తెలంగాణ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, అమరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షలు, ఉద్యమ స్ఫూర్తితో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని, ప్రతి యువకుడికి అవకాశాలు లభించాలని, తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల కల అయిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం 2014 జూన్ 2న సాకారమై, దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించిందని పేర్కొన్నారు. ఈ రాష్ట్ర సాధన వెనుక పోరాడిన మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో లిలికందాడ జంగారెడ్డి, శ్రీనివాస ఆచార్య, సంతోష్, గుమ్మడి మోహన్ రెడ్డి, చంద్రమోహన్, భిక్షపతిలిలి తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన దాట్ల పృథ్వీరాజ్



ముమ్మిడివరం,పల్లె వెలుగు జూన్ 02 :- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దాట్ల పృథ్వీరాజ్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, శాసనసభ విప్ మరియు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పర్యవేక్షణలో నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం అందేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరి మూర్తి, నడింపల్లి ఫణి మరియు గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు

## రాధాకృష్ణను పరామర్శించిన విప్పర్తి వేణుగోపాలరావు



అంబాజీపేట,పల్లె వెలుగు మంగళవారం జూన్ 02 :- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వక్కలంక రాధాకృష్ణ సోదరుని మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న ఆయన్ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్, రాష్ట్ర యస్.సి.సెల్ జోన్ 2 వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు పిఠాపురం నియోజకవర్గ పరిశీలకులు విప్పర్తి వేణుగోపాలరావు పరామర్శించారు. అంబాజీపేటలోని రాధాకృష్ణ స్వగృహానికి చేరుకున్న వేణుగోపాలరావు, ఆయనను ఓదార్చి ధైర్యం చెప్పారు. సోదరుని మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్న ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. రాధాకృష్ణకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందన్నారు. సమాజంలో ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వక్కలంక రాధాకృష్ణ కుటుంబానికి ఎదురైన ఈ దుఃఖకర సమయంలో పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు సైతం ఆయనకు అండగా నిలుస్తున్నారు. సమాజ సేవా మార్గంలో రాధాకృష్ణ చేస్తున్న కృషిని, ఆయన కుటుంబ సభ్యుల నిబద్ధతను ఈ సందర్భంగా వేణుగోపాలరావు గుర్తు చేసుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు

# తమ్మడపల్లెలో దేవర మహోత్సవ సంబరాలు

**మహానంది, పల్లె వెలుగు**





మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో పెద్దమ్మ దేవర మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి ఘనంగా దేవర మహోత్సవ సంబరాలు నిర్వహించారు.దేవర సంప్రదాయం ప్రకారం దున్నపోతును గ్రామంలో ఊరేగించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో కళాకారులు పెద్దమ్మవారిని తయారు చేశారు. అమ్మవారిని అర్ధరాత్రి సమయంలో పీఠానికి చేర్చారు. అక్కడ పీఠార్చన, ప్రాణప్రతిష్ఠ, నైవేద్య సమర్పణ వంటి పలురకాల పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కళాప్రదర్శనలు అలరించాయి.70 ఏళ్ల తర్వాత జరుగుతున్న దేవర సందర్భంగా బంధుమిత్రుల రాకపోకలతో గ్రామం అంతా కళకళలాడుతోంది.

### దేవర మహోత్సవాలకు పటిష్ట బందోబస్తు



పెద్దమ్మ దేవర మహోత్సవాలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాస రెడ్డి,ఎస్ ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి లు తెలిపారు. మంగళవారం సాయంత్రం తమడపల్లె గ్రామంలో పార్కింగ్,పలు కూడళ్లను పరిశీలించారు.గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సలహాలు,సూచనలు చేశారు.

## ఘోరం: రెండు బస్సులు ఢీ.. 10 మంది మృతి.. 40 మందికి సీరియస్



ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బస్సులు ఒకదాన్నొకటి ఢీ కొని 10 మంది మృతి చెందారు. అనేకమంది గాయాలపాలయ్యారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ షాకింగ్ ఘటన గుజరాత్ రాష్ట్రం, సూరత్ జిల్లాలోని బార్డోలీ తహసీల్ పరిధిలో ఉవా గ్రామం వద్ద చోటుచేసుకుంది. మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఓ బస్సు సూరత్ నుంచి ధూలే వైపు వెళ్తుండగా.. బార్డోలీ తాలుకాలోని ఉవా గ్రామం సమీపంలో ఓ బస్సు ప్రమాదవశాత్తు రోడ్డుపై ముందుగా వెళ్తున్న ఓ ట్రాక్టర్ ను ఢీ కొట్టింది. ఈ క్రమంలో బస్సు నియంత్రణ కోల్పోయింది. అలా వేగంగా సెంట్రల్ డివైడర్ ను దాటి అవతలి రోడ్డు వైపు దూసుకెళ్లింది. అదే సమయంలో అటు నుంచి ఎదురుగా వస్తున్న మరొక మహారాష్ట్ర ప్రభుత్వ బస్సును బలంగా ఢీ కొట్టింది. ఆ తర్వాత ఒక బస్సు రోడ్డు పక్కన ఉన్న లోతట్టు ప్రాంతంలోకి బోల్తా పడింది. బోల్తా పడిన వెంటనే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. దాంతో లోపలే ఉన్న ప్రయాణికులు బయటకు రాలేకపోయారు. అలా 10 మంది ప్రయాణికులు బస్సులోనే సజీవదహనం అయ్యారు. మిగతా ప్రయాణికులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. మొత్తం 40 మందికిపైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది.

ఇక ఈ ప్రమాద ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించినవారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి నుంచి మరణించినవారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడినవారికి రూ. 50 వేలు చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ఈ మేరకు పీఎంఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

## మాదిగల్లో అక్షరాస్యతను పెంచడం కోసం 40 డెస్ గో టు విలేజీ ప్రోగ్రాం.

- **ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకొని విద్యా ఉద్యోగాల్లో ముందుకు రావాలి .**
- **జులై 7 న ఎం ఆర్ పి ఎస్ ఆవిర్భవ దినోత్సవాన్ని మాదిగ జాతి పండుగగా జరుపుకోవాలి.**
- **ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ**

ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 2పల్లె వెలుగు :మాదిగ సామాజిక వర్గంలో డ్రాప్ అవుట్స్ ని తగ్గించి, విద్యా అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మే 25 నుండి ప్రారంభమైన కార్యక్రమం జులై 5 వరకు 40 రోజుల పాటు నిర్విరామంగా గో టు విలేజ్ కార్యక్రమం జరుగుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ తెలిపారు . మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల సమీక్షా సమావేశం మార్కెట్ యార్డ్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. మున్నంగి నాగరాజు మాదిగ మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ద్వారా సాధించిన వర్గీకరణ ఫలితాలు మాదిగ ప్రజలు సంపూర్ణంగా అందుకునేందుకు గోటు విలేజ్ కార్యక్రమానికి మంద కృష్ణ మాదిగ పిలుపు పిలుపు నిచ్చినట్లు తెలిపారు. అక్షరాస్యతలో తీవ్రంగా వెనుకబడిన కులంగా మాదిగలు ఉన్నారని అన్నారు. అందువల్ల మాదిగలకు విద్యా యొక్క ప్రాముఖ్యతను వివరించి అక్షరాస్యతను పెంపొందించడం కోసం ప్రతి గ్రామాల్లో చైతన్య సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ లో ఎస్సీ వర్గీకరణ ఫలితాలు 6.5 శాతం గా అమలు జరుగుతున్నందున రిజర్వేషన్ సదుపాయాలు మాదిగలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.



ఆర్థిక ఇబ్బందులూ, కుటుంబ సమస్యలు మొదలగు ఇబ్బందుల వల్ల మాదిగలు చదువులకు దూరం కావద్దు అని అన్నారు. అత్యంత పేదరికంలో ఉన్న మాదిగలు అభివృద్ధిలోకి రావాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు. ఉన్నత చదువుల కోసం అందుబాటులో ఉన్న అన్ని రకాల మార్గాలను ఉపయోగించుకుందాం అని అన్నారు. 30 ఏళ్లు పోరాటం చేసి సాధించిన వర్గీకరణ ఫలాలను అందుకొని ఉన్నత విద్యారంగంలో , ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ జాతి రాణించాలని పిలుపునిచ్చారు.

మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన జెండా దిమ్మెలను నిర్మాణం చేసుకోవాలని కోరారు. జులై 7 న మాదిగ జాతి పండుగగా ఎమ్మార్పీఎస్ జెండా పండుగ చేసుకోవాలని కోరారు.

అలాగే అన్ని మాదిగ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నూతన కమిటీ నిర్మాణాలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు శివ నారాయణ మాదిగ ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షులు దర్గయ్య మాదిగ ఎంఈఎఫ్ జాతీయ నాయకులు బుచ్చర్ల నరసింహులు మాదిగ ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బాయికాటి బెనర్జీ మాదిగ ఎం.ఎస్.పి రాష్ట్ర నాయకులు కోళ్ల కళ్యాణ్ మాదిగ ఎం.ఎస్.పి జిల్లా అధికార ప్రతినిధి కేపీ ఓబులేసు మాదిగ ఎం.ఎస్.పి జిల్లా సీనియర్ నాయకులు మేకల దస్తగిరి ఎం ఈ ఎఫ్ తిరుపతయ్య మాదిగ.సంజీవ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ మాదిగ ఎం.ఎస్.పి జిల్లా సీనియర్ నాయకులు రామాంజనేయులు మాదిగ ఎం.ఎస్.పి సీనియర్ నాయకులు గణ మదిలేటి , సంజీవ రాయుడు, బాలలింగం, డోక్కల హక్కుల రాంబాబు ఆళ్లగడ్డ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నాగిపోగుల రాజేష్ మాదిగ ఉయ్యాలవాడ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బోడిమాముల సుబ్బరాయుడు సిరివెళ్ల మండల అధ్యక్షులు ఎంఎస్పి ఉసేని చాగలమర్రి మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు ప్రతాప్ మాదిగ ఎం ఎస్ పి ఉయ్యాలవాడ మండల అధ్యక్షులు చిన్న ఓబులేసు మాదిగ ఎమ్మెస్ ఎఫ్ ఉయ్యాలవాడ మండల అధ్యక్షులు రాంబాబు మాదిగ దొర్నిపాడు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కిట్టు మాదిగ రుద్రవరం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కత్తి చిన్న వెంకటసుబ్బయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ సిరివెళ్ల మండల అధ్యక్షుడు కమతం లక్ష్మీ నరసింహుడు మాదిగ ఎంఎస్పి రుద్రవరం మండల అధ్యక్షులు నందవరం బాలుడు మాదిగ సిరివెళ్ల ఎం.ఎస్.పి మండల అధ్యక్షులు గాలి జైపాల్ మాదిగ ఎం ఈ ఎఫ్ మండల నాయకులు నాగేంద్ర మాదిగ ఎంఎస్పీ టౌన్ నాయకులు నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు

## అన్నా క్యాంటీన్లలో ఆహార పదార్థాలు తగినంత వడ్డించండి.

**-కమిషనర్ (ఎఫ్.ఏ.సి ) శారదా దేవి**

తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 2పల్లె వెలుగు :నగరంలోని అన్నా క్యాంటీన్లలో ఆహార పదార్థాలు వృధా చేయకుండా ప్రజలకు తగినంత వడ్డించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్. ఏ. సి.) శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రి భోజనం రుచి చూసి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అన్నా కాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

